సాక్షి
కర్నూలు
శనివారం, 27, జనవరి, 2024



## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వై.సతీష్‌కుమార్ రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



## వైభవంగా ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి శుక్రవారం ఊయలసేవను శాస్త్రోక్తపూజలతో నిర్వహించారు. అలాగే గ్రామదేవత అంకాలమ్మకు ప్రత్యేక అభిషేకాది కుంకుమార్చనలు చేపట్టారు.



## శ్రీశైలంలో హైకోర్టు జడ్జి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

## న్యూస్‌రీల్

### కర్నూలు సర్కిల్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూటరీ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) కర్నూలు సర్కిల్ వివిధ అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరచడంతో బెస్ట్ సర్కిల్ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో సీఎండీ సంతోష్‌రావు చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను కర్నూలు సర్కిల్ ఎస్ఇ ఎం.ఉమాపతి అందుకున్నారు. వరుసగా రెండో సారి ఈ అవార్డు లభించడం విశేషం. ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాను సమయంలో వాకాడు, నెల్లూరు, గూడూరు ప్రాంతాలకు వెళ్లి విశేషంగా సేవలు అందించినందుకు గుర్తింపుగా ఎస్ఈ ఉమాపతి ఇదే కార్యక్రమంలో మరో అవార్డు పొందారు.

### వాహన తనిఖీల్లో రూ. 43 లక్షల నగదు పట్టివేత



పట్టుకున్న నగదును చూపుతున్న పోలీసులు

కృష్ణగిరి: అమకతాడు టోల్‌గేట్ వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు చేపట్టిన వాహన తనిఖీలో భారీగా నగదు పట్టుబడింది. హైదరాబాద్ నుంచి అనంతపురానికి వెళ్లుతున్న ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో అనంతపురానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సాయిప్రసాద్‌రెడ్డి బ్యాగ్‌లో నగదు తీసుకెళ్లుతున్నట్లు గుర్తించారు. బ్యాగ్‌లో రూ.43.20లక్షల వరకు ఉన్నట్లు గుర్తించి రెవిన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేశారు. నగదును సీజ్ చేసి ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అందిననున్నట్లు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐతోపాటు కృష్ణగిరి, వెల్దుర్తి ఎస్ఐలు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలు, సిబ్బంది పాల్గొన్నారు.

### మున్సిపల్ అధికారులకు స్థానచలనం

కర్నూలు (టౌన్): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూడు సంవత్సరాలుగా ఒకేచోట పనిచేస్తున్న మున్సిపల్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ శుక్రవారం మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మీ జీవో 105 జారీ చేశారు. 2019 సంవత్సరం నుంచి కర్నూలు నగరపాలక సంస్థలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.వి.వి. రామలింగేశ్వర్‌ను గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. అలాగే డిప్యూటీ కమిషనర్ ఎస్.వి. శివారెడ్డిని వినుకొండ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ రెండు పోస్టుల్లో ఎవరినీ నియమించలేదు. అలాగే నగరపాలక కార్యదర్శిగా పనిచేస్తున్న షేక్ మాలిక్‌ను రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈయన స్థానంలో నగరపాలక ప్రజారోగ్యశాఖలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న నాగరాజుకు కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### 1 నుంచి అందుబాటులోకి విజయవనం



విజయవనం పుల్లయ్య పార్క్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ రామకృష్ణ

కర్నూలు కల్చరల్: నగర శివారులోని వెంగన్న బావి సమీపంలోని విజయవనం పుల్లయ్య పార్క్ ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి అందుబాటులోకి వస్తుందని అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి. రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన డీఎఫ్‌వో పి. శివశంకర్‌రెడ్డితో కలిసి విజయవనం పుల్లయ్య పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 93 లక్షల వ్యయంతో 34 హెక్టార్లలో విజయవనాన్ని అభివృద్ధి చేశామన్నారు. డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రధాన ద్వారం, పార్క్, చిల్డ్రన్స్ ప్లేగ్రౌండ్ పనులు పూర్తి అయ్యాయన్నారు. మరో రూ.40 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విజిటర్స్‌ను అనుమతిస్తామని, ప్రవేశ రుసుం పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 ఉంటుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఫారెస్ట్ రేంజర్ రమణారెడ్డి, సోషల్ ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్, ఆదోని ఎఫ్ఆర్‌వో తేజశ్విని పాల్గొన్నారు.



వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సమగ్ర శిక్ష అభయం శకటం



రెండో బహుమతి సాధించిన గృహనిర్మాణ శాఖ శకటం



వైద్యారోగ్యశాఖ శకటంలో వైద్య సిబ్బంది

# జిల్లాలో ప్రగతి పరుగులు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

- విద్య, వైద్యరంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత
- సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక మార్పు
- లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు
- గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో కలెక్టర్ డాక్టర్ సృజన
- వేడుకల్లో ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు, స్టాళ్లు

కర్నూలు: జిల్లాలో ప్రగతి పరుగులు పెడుతోందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కర్నూలులోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. సాయుధ బలగాలు కవాతు నిర్వహించగా, మైదానంలో పరేడ్ పరిశీలన వాహనంపై నుంచి ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి కలెక్టర్ పర్యటిస్తూ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు వివరించారు.

### ప్రజల వద్దకే పాలన

సచివాలయాల ద్వారా గ్రామ పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం నాంది పలికిందని కలెక్టర్ సృజన తెలిపారు. మునుపటిలా ప్రజలు మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే నిర్దిష్ట వ్యవధిలో సచివాలయాల ద్వారా ప్రజలకు 535 రకాల పౌర సేవలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. సచివాలయాలు ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో ఇప్పటివరకు 42.48 లక్షల పౌర సేవలను అందించామన్నారు. సచివాలయాల ద్వారా అభివృద్ధి కార్యక్రమాల అమలును కూడా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. సచివాలయాల కోసం జిల్లాలో రూ.167 కోట్ల అంచనా వ్యయంతో 383 శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టగా అందులో రూ.86 కోట్ల ఖర్చుతో 242 భవనాలు పూర్తయ్యాయన్నారు.

### రైతు సంక్షేమమే లక్ష్యం

విత్తు నుంచి విక్రయం దాకా రైతులకు అవసరమయ్యే అన్ని రకాల సేవలను గ్రామంలోనే అందించే విధంగా జిల్లాలో 466 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కలెక్టర్ తెలిపారు. వీటి ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు సలహాలు అందించడం, ఈ-పంట నమోదు తదితర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ.50 కోట్ల ఖర్చుతో 204 రైతు భరోసా కేంద్రాల భవనాలు పూర్తయ్యాయన్నారు.

### వైద్యరంగం అభివృద్ధి

వైద్యరంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఆదోనిలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల పనులు చురుకుగ్గా సాగుతున్నాయన్నారు. సర్వజన వైద్యశాల ఆవరణంలో రూ.120 కోట్లతో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను త్వరలో రోగులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ బలోపేతంలో భాగంగా నాడు-నేడు కింద రూ.500 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రూ.12 కోట్లతో నిర్మించిన డయాగ్నొస్టిక్ బ్లాక్‌ను రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్డియాలజీ విభాగంలో రూ.6 కోట్లతో గుండె పరీక్షకు అవసరమైన క్యాథ్‌ల్యాబ్‌ను, డయాగ్నొస్టిక్ బ్లాక్‌లో రూ.3.5 కోట్లతో సీటీ స్కాన్‌ను, రక్తనిధి కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. రూ.2.18 కోట్లతో నిర్మిస్తున్న బర్న్స్ వార్డు కూడా త్వరలో పూర్తి కానుందన్నారు. కర్నూలు, ఆదోని ఆసుపత్రులలో రూ.2 కోట్లతో చేపడుతున్న డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ పనులు పూర్తయ్యాయన్నారు.

### పల్లె ముంగిటికే వైద్యం

చిన్నచిన్న రోగాలకు పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన పని లేకుండా వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ద్వారా ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు రూ.44 కోట్లతో 202 శాశ్వత భవనాలు నిర్మిస్తుండగా ఇప్పటివరకు 38 భవనాలు పూర్తయ్యాయన్నారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తోందని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 కోట్లను ఖర్చు చేసి 372 పనులు పూర్తి చేశామన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ సృజన



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

### మెరుగుపడిన మహిళల జీవనోపాధి

వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 45-60 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళల ఆర్థికాభివృద్ధికి మూడు విడతల్లో 1.24 లక్షల మందికి పైగా రూ.667 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించినట్లు చెప్పారు. మహిళల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.65 కోట్ల రుణాలను మంజూరు చేశామన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మిక కుటుంబాల్లోని ఆడపిల్లలకు నాలుగు విడతల్లో 2,367 జంటలకు ఆర్థిక సాయంగా రూ.19 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు.

### స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానం

స్వాతంత్ర్యం పోరాటంలో పాలుపంచుకున్న సమరయోధుల వారసులను కలెక్టర్ సృజన ఎస్పీ కృష్ణకాంత్‌తో కలసి సన్మానం చేశారు. సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ అన్నారు.. గుర్రం జైపాల్‌రెడ్డి, సర్దార్ బుచ్చిబాబు, జి.సుబ్బమ్మ, ఎస్.డి.నాగేంద్రప్రసాద్, బాషా బియాబాని, కథం తుక్క చంద్రకుమార్, రాధాకృష్ణమూర్తి తదితరులను శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.



బాలిక నృత్య ప్రదర్శన

### ఠంచన్‌గా పింఛన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 1వ తేదీ వలంటీర్ల ద్వారా ఠంచన్‌గా పింఛన్ అందజేస్తోందన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏడు రకాల పింఛన్‌దారులకు పింఛన్ మొత్తాన్ని రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచినట్లు చెప్పారు. ఈనెల 2,48,905 మందికి రూ.74.53 కోట్ల పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. వికలాంగులు, హిజ్రాలు, డప్పు కళాకారులకు రూ.3 వేల చొప్పున, తలసీమియా, హిమోఫిలియా వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు చొప్పున, బోదకా లు, పక్షవాతం, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.5 వేలు చొప్పున పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు.

### పేదలకు సొంతింటి కల సాకారం

నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంతింటి కల సాకారమవుతోందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 16,403 ఇళ్ల పూర్తి కాగా, మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇప్పటివరకు ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రూ.436 కోట్లను చెల్లించడం జరిగిందన్నారు. గృహ నిర్మాణాల్లో నీటి వసతి కల్పించడం కోసం రూ.42 కోట్లను ఖర్చు చేసినట్లు చెప్పారు. ఏపీ టిడ్కో కింద కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఇప్పటివరకు 15,900 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతులకు ఇప్పటివరకు రూ.977 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. కర్నూలు శివారులోని జగన్నాథగట్టు వద్ద 50 ఎకరాల్లో రూ.88.50 కోట్లతో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాల, క్లస్టర్ విశ్వవిద్యాలయ భవన సముదాయాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.



కవాతు చేస్తున్న పోలీసులు





థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

### అభివృద్ధిని ప్రతిబింబిస్తూ స్టాల్స్ ఏర్పాటు

వివిధ శాఖల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లో అభివృద్ధిని ప్రతిబింబిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వాటిని కలెక్టర్‌తో పాటు ఎస్పీ, జేసీ, నగరపాలక సంస్థ కమిషనర్ సందర్శించారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధిని ప్రతిబింబిస్తూ 11 ప్రభుత్వ శాఖలు మైదానంలో శకటాలను ప్రదర్శించగా అందులో సమగ్ర శిక్ష విద్యాశాఖ శకటానికి మొదటి బహుమతి, గృహ నిర్మాణ శాఖ శకటానికి రెండో బహుమతి, వైద్య ఆరోగ్య శాఖ శకటానికి మూడో బహుమతి లభించింది. అలాగే స్టాల్స్‌లో మొదటి బహుమతి వ్యవసాయ శాఖ, రెండో బహుమతి సూక్ష్మ నీటి సాగు (ఏపీఎంఐపీ), మూడో బహుమతి జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ (ఐసీడీఎస్) కైవసం చేసుకున్నాయి. గణతంత్ర వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేడుకల్లో జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, అదనపు ఎస్పీ నాగరాజు, కేడీసీసీ చైర్మన్ విజయ మనోహరి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, డీఆర్వో మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### విద్యకు అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అమ్మ ఒడి పథకం కింద జిల్లాలో ఏడాదికి 2.40 లక్షల మందికి పైగా విద్యార్థుల తల్లులకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున నాలుగేళ్లలో రూ.1,439 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా 1,443 పాఠశాలల్లో 2,81,600 మంది విద్యార్థులకు మరింత నాణ్యతతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.95 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు డిజిటల్ బోధన అందించాలనే ఉద్దేశంతో జిల్లాలో 62,401 బైజూస్ ట్యాబ్స్‌ను పంపిణీ చేశామన్నారు.



గణతంత్ర వేడుకల్లో బాలికల ప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థులు

# ప్రతి ఒక్కరికీ రాజ్యాంగ ఫలాలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తదితరులు

కర్నూలు (టౌన్): రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్‌ఖాన్ అన్నారు. నగరంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత బాపూజీ మహాత్మాగాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశం కోసం ఎంతో మంది ప్రాణాలు అర్పించారన్నారు. సమర యోధులు ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారయణమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరి సుభాష్ చంద్రబోస్, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ ఆచారి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్. మద్దయ్య, వైఎస్ఆర్ సేవాదళ్ అధ్యక్షులు కేధార్‌నాథ్, కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి,గాజుల శ్వేతారెడ్డి, షేక్ నీలోఫర్, పార్టీ నాయకులు గడ్డం రామక్రిష్ణ, నాగేశ్వరీ, సాయి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టులో ఘనంగా గణతంత్ర వేడుకలు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా జడ్జి శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్): జిల్లా కోర్టు ఆవరణలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8:30 గంటలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు తన సహచర న్యాయమూర్తులతో కలసి జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ పతాకం ఆవిష్కరణ చేశారు. అనంతరం న్యాయవాదులకు, న్యాయశాఖ సిబ్బందికి మిఠాయి పంచి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు శ్రీనివాస కుమార్, పాండు రంగారెడ్డి, భూపాల్ రెడ్డి, సునిత, సబ్ జడ్జీలు మల్లీశ్వరి, శ్రీనివాసరావు, దివాకర్, జూనియర్ సివిల్ జడ్జీలు జ్యోత్స్న దేవి, కల్యాణి, వందన, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాం భగవాన్, శ్రీనివాసలు, సుస్మిత, రాజేంద్రప్రసాద్, ప్రేమలత, ప్రకాశరెడ్డి, స్వాములు, ఎంఎస్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

### వినియోగదారుల కమిషన్‌లో..

జిల్లా వినియోగదారుల కమిషన్‌లో అధ్యక్షులు కరణం కిషోర్ కుమార్ ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు నారాయణరెడ్డి, నసీమా కౌసర్, న్యాయవాదులు పాల్గొన్నారు.